నూతన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే నూతన క్యాంపు కార్యాలయం ప్రారంభం

జనగామ చౌరస్తా, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని సాయినగర్ టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నూతన క్యాంపు కార్యాలయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునాలింగయ్య, వైస్‌చైర్మన్ మేకల రాంప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జమున మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట సుఖాల్లో ఎమ్మెల్యే పల్లా పాలు పంచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, గుర్రం భూలక్ష్మి నాగరాజు, దేవరాయ నాగరాజు, పేర్ని స్వరూప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొల్లం శారద, యూత్ పట్టణ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, దేవునూరి సతీశ్, తిప్పారపు విజయ్, యాకూబ్ పాషా, రాజు, శ్రావణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భగీరథ నీటి అంతరాయానికి ఫుల్‌స్టాప్

దేవరుప్పుల వంతెనపై బిగిస్తున్న భగీరథ స్టీల్ పైప్‌లైన్

దేవరుప్పుల, మార్చి 28 : దేవరుప్పుల గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడానికి వాగు లోపలి నుంచి ప్లాస్టిక్ పైపులైన్ ఉండడం వల్ల ప్రతి వానాకాలం వరదలకు అది కొట్టుకుపోతోంది. ఈ అంతరాయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ(భగీరథ విభాగం) తొలగించి, శాశ్వత పరిష్కారం చూపింది. వాగులో ఉన్న ప్లాస్టిక్ పైపులైన్‌ను తొలగించి, వంతెనపై నుంచి కొత్తగా స్టీల్ పైపులైన్‌ను బిగించారు. రెండు వారాలుగా శ్రమించి 519 మీటర్ల పొడవుతో 200 ఎంఎం డయా పైపులైన్ వేశారు. దీంతో వానాకాలంలో పైపులైన్ కొట్టుకుపోయే బాధ తప్పింది. దేవరుప్పుల, కొత్తవాడ, దేవరుప్పుల తండాలకు నీటి అంతరాయం లేకుండా శాశ్వత పరిష్కారం దొరికినట్లయింది.

ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసానికి లేఖ

పాలకుర్తి: అవిశ్వాసంపై డీసీవోకు దరఖాస్తు అందిస్తున్న డైరెక్టర్లు

పాలకుర్తి, మార్చి 28 : పాలకుర్తి ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కారుపోతుల వేణుపై అవిశ్వాసం ప్రకటించినట్లు తొమ్మిది మంది డైరెక్టర్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి వై రాజేందర్‌రెడ్డికి లేఖ అందజేశారు. సొసైటీలో 13మంది డైరెక్టర్లు ఉండగా తొమ్మిది మంది ఎడవెల్లి పుష్పలీల(పాలకుర్తి), ధరావత్ వాసు(కొండాపురం), చింతం వెంకన్న(మల్లంపెల్లి), గంట రామయ్య(వావిలాల), బలుగుల స్వరూప(వల్మిడి), చిలువేరు వీరయ్య(ముత్తారం), కారుపోతుల శ్రీనివాస్‌గౌడ్(చెన్నూరు), దండబోయిన నాగమల్లు(బమ్మెర), కాటు శేఖర్(బమ్మెర) కలిసి డీసీవోకు లేఖ అందించారు.

ఎన్నికల విధులు సమన్వయంతో నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా
- నోడల్ అధికారులతో సమీక్ష

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మార్చి 28 : ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల విధులను సంబంధిత అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో జాగ్రత్తగా నిర్వర్తించాలని జనగామ జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఓటర్లలో చైతన్యం కల్పించడానికి 'స్వీప్' ద్వారా పాఠశాల, కళాశాలల్లో ఫ్లెక్సీలతో ప్రచార ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాక్ పోలింగ్ ద్వారా యువత, మహిళలకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రంగోలి, క్విజ్, 5కే రన్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అక్రమ మద్యం, నగదు రవాణాను అడ్డుకోవడానికి చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తరిగొప్పులలో రూ.2 లక్షల నగదు, రూ.లక్ష లిక్కర్ సీజ్ చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ ద్వారా 166 ఫిర్యాదులను స్వీకరించి 141 పరిష్కరించినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ఓపెనింగ్, క్లోజింగ్ చేపట్టినట్లు చెప్పారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

సువిధ యాప్ ద్వారా అభ్యర్థులకు సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సెల్ ఫోన్ నంబర్లను స్మాల్ బుక్‌లెట్‌గా ముద్రించి అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, జడ్పీ సీఈవో అనిల్ కుమార్, నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

అరుణ జ్యోతి(ఫైల్)

నర్మెట, మార్చి 28 : తన విద్యార్థులకు పదో తరగతి పరీక్ష ఉండడంతో పరీక్ష కన్నా ముందే వారిని కలిసి మనోధైర్యాన్ని కల్పించాలని పరీక్ష కేంద్రానికి వస్తున్న సైన్స్ ఉపాధ్యాయురాలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తరిగొప్పుల మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో జన్ను అరుణజ్యోతి(37) సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. తన స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఉండడంతో వారిని కలిసేందుకు జనగామ నుంచి తరిగొప్పులలోని పరీక్ష కేంద్రానికి గురువారం ఉదయం తన భర్తతో కలిసి స్కూటీపై వస్తున్నది. ఈ క్రమంలో నర్మెట శివారు గుంటూరుపల్లి స్టేజీ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జనగామ జిల్లా దవాఖానకు తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడే ఆమె మృతిచెందింది. మృతురాలికి 11 నెలల చిన్నారి ఉంది. కాగా, ఈ విషయమై నర్మెట ఎస్సై శ్రీకాంత్ యాదవ్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని, రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతిచెందిందని తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సింధు ఎంపిక

తోకల సింధు

రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 28 : రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన తోకల సింధు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఎర్రోళ్ల కుమార్‌గౌడ్, అధ్యక్షుడు పోగుల సారంగపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2,3,4 తేదీల్లో సూర్యాపేట జిల్లా చింతలపల్లి గ్రామంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో తోకల సింధు ప్రతిభ కనబర్చి మార్చి 30 నుంచి ఏప్రిల్ 2వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, సహాయ కార్యదర్శి తోటకూరి వెంకటేశ్వర్లు, కుమార్, సుధాకర్, మహేశ్ పాల్గొన్నారు.

విజయ దుర్గామాత ఆలయంలో చోరీ

దుండగులు ధ్వంసం చేసిన హుండీ

జనగామ చౌరస్తా, మార్చి 28 : జనగామ పట్టణంలోని బతుకమ్మకుంట విజయ దుర్గామాత ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగిందని అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపారు. ఆలయ హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు రూ.20వేల నగదును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో గతంలో కూడా అమ్మవారి ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గత నాలుగు రోజుల వ్యవధిలో వరుస చోరీలకు పాల్పడుతూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇటీవల పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న ఓ ప్రైవేట్ బ్యాంకు ఎదుట ఆగిఉన్న కారు అద్దాన్ని పట్టపగలే ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.2 లక్షల నగదును ఓ దొంగ దోచుకెళ్లగా, మరుసటి రోజు రాత్రి దుర్గామాతా దేవాలయంలో హుండీని ధ్వంసం చేసి సుమారు రూ.20 వేల నగదును దుండగులు దోచుకెళ్లారు.

నేడు రఘునాథపల్లి అంగడి వేలం

రఘునాథపల్లి మార్చి 28 : మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే అంగడి(సంత) వేలాన్ని 2024-25 సంవత్సరానికి గాను శుక్రవారం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ వై రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాల్ వద్ద ఉదయం 9నుంచి 11:30 వరకు నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనేవారు రూ.1.5 లక్షల విలువ గల ఆస్తి ధ్రువపత్రం, భూమి దస్తావేజులు, తహసీల్దార్ ధ్రువీకరించిన పత్రాలను సమర్పించాలని సూచించారు.

శస్త్రచికిత్సలను అందుబాటులోకి తీసుకొస్తాం

- డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్
- ప్రభుత్వ దవాఖానలో తనిఖీ



మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 28 : డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఆపరేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని జనగామ డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. గురువారం స్థానిక దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా పథకం ద్వారా అందుతున్న సేవల గురించి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జనార్దన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓపీల సంఖ్యతో పాటు ప్రసవాల సంఖ్య పెంచి పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వందపడకల దవాఖాన మంజూరైనందున ఇక్కడ ఆపరేషన్ సేవలను అందుబాటులోకి వస్తాయన్నారు. దవాఖానలో స్త్రీల వైద్య నిపుణులు, పిల్లల డాక్టర్లు, దంత, చర్మ సంబంధిత వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ రజిని, డాక్టర్ ప్రసన్నకృష్ణ, హెచ్ఈ ప్రభాకర్, సీహెచ్‌వో సాంబయ్య, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడు చంద్ర రుషి

జనగామ చౌరస్తా, మార్చి 28 : బార్ అసోసియేషన్ జనగామ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో మొత్తం 118 మంది ఓటర్లు ఉండగా, 113 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగందుల చంద్రరుషి తన ప్రత్యర్థి అభ్యర్థి హరిప్రసాద్‌యాదవ్‌పై 79/34 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఎన్ బాలకిషన్‌గౌడ్ తన ప్రత్యర్థి అభ్యర్థి రాంరెడ్డిపై 77/36 ఓట్లతో విజయం సాధించారు. అలాగే, ప్రధాన కార్యదర్శిగా నక్క సిద్ధులు తన ప్రత్యర్థి అభ్యర్థులైన రేణుక, రాజయ్యపై 55/33/25 ఓట్ల తేడాతో గెలుపొందారు. మిగతా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో కోశాధికారిగా చెరుకు చంద్రశేఖర్‌గౌడ్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీగా పసునూరి మురళి, జాయింట్ సెక్రటరీగా మన్నె సత్తయ్య, ఈసీ మెంబర్లుగా ఉదయ్, జ్యోత్స్న, రవి కుమార్, దాసు ఎన్నికయ్యారు.

భూమి పట్టా చేయాలని వినతి

భూ సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

బచ్చన్నపేట, మార్చి 28 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన రైతు పాకాల పోశయ్య తన భూమికి పట్టా చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన కొన్నె నుంచి బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయానికి నడుచుకుంటూ వచ్చి గురువారం డిప్యూటీ తహసీల్దార్ ఖాసీంకు వినతి పత్రాన్ని అందజేశాడు. కొన్నెలో 161సర్వేనంబర్‌లో నాలుగు ఎకరాల భూమిని 60ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని, ఆ భూమిని గతంలో పట్టా చేయాలని అధికారులను అడిగితే రూ.4లక్షల లంచం అడిగారని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి తనకు పట్టా అందించాలని కోరారు. కాగా, వినతి పత్రం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్ ఖాసీం, రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామానికి చేరుకొని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రికార్డులను ఉన్నతాధికారులను పంపిస్తామని వారు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ఆరో రోజు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు

జనగామ చౌరస్తా, మార్చి 28 : జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన జీవ శాస్త్రం పరీక్షకు 6698 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 6692 మంది మాత్రమే పరీక్ష రాశారు. మిగతా ఆరుగురు గైర్హాజరైనట్లు డీఈవో రాము తెలిపారు. 99.91 హాజరు శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. నర్మెట, తరిగొప్పుల, మల్కాపూర్ జడ్పీహెచ్ ఎస్ ఏ, బీ సెంటర్లతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ జడ్పీహెచ్ఎస్(గర్ల్స్)ను డీఈవో పరిశీలించారు. మల్కాపూర్ ఏ, బీ సెంటర్లు, తరిగొప్పుల జడ్పీహెచ్ఎస్‌ను రాష్ట్ర అబ్జర్వర్ విజయలక్ష్మి బాయి తనిఖీ చేశారు. అలాగే, జిల్లాలోని మరో 7 పరీక్ష కేంద్రాలను రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

పత్తి సాగులో యాజమాన్యంపై అవగాహన

కాశీబుగ్గ, మార్చి 28 : వరంగల్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం పత్తి మొదళ్ల యాజమాన్యంపై పత్తి పరిశోధన విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ పత్తి మొదళ్లు కాల్చడం ద్వారా కలిగే అనర్థాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడమే కాకుండా రైతుల సందేహాలను నివృత్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాములు, డాక్టర్ ఓం ప్రకాశ్, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఆర్థిక సాయం అందిస్తున్న దివ్యాంగుల సంఘ నాయకులు

నర్మెట, మార్చి 28 : తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జనగామ జిల్లా కమిటీ అధికార ప్రతినిధి కల్యాణం రాజు తండ్రి వెంకటయ్య(65) ఇటీవల అనారోగ్యంతో మండలంలోని వెల్దండ గ్రామంలో మృతిచెందాడు. ఈ మేరకు రాజును సంఘం బాధ్యులు పరామర్శించి రూ.3వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాయారపు ఉపేందర్, మండల అధ్యక్షుడు మోడెం రాజు, గ్రాడ్యుయేట్ జిల్లా అధ్యక్షుడు పెరబోయిన శ్రీధర్, నాయకులు కాసు కనకయ్య, లింగస్వామి, అశోక్, బాలరాజు, రాజు, వినోద్, రాములు, యాదగిరి, వంశీ, యాకూబ్, ప్రభాకర్, అంజయ్య, మహేశ్, కల్యాణ్, దేవయ్య పాల్గొన్నారు.

వాణిజ్య అభివృద్ధిలో సాంకేతిక తోడ్పాటు

కేయూ మాజీ వీసీ వెంకటరత్నం

మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ వెంకటరత్నం

హనుమకొండ, మార్చి 28 : వాణిజ్య అభివృద్ధిలో సాంకేతిక విజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని, సాంకేతిక విప్లవం ప్రపంచ రూపురేఖలను మార్చి వేసిందని కేయూ మాజీ వీసీ వెంకటరత్నం అన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'ఫినిటెక్ రెవల్యూషన్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ అభివృద్ధితో కొనుగోలు విధానం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందన్నారు. కేయూ మాజీ రిజిస్ట్రార్ సాయిలు మాట్లాడుతూ.. కొవిడ్ తర్వాత వర్చువల్ సెమినార్లు నిర్వహించడం పరిపాటిగా మారిందన్నారు. యూజీసీ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారతదేశం ఐదో ఆర్థిక శక్తిగా ఎదగడానికి టెక్నాలజే కారణమన్నారు. 2030 నాటికి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బిజినెస్ కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెమినార్ డైరెక్టర్ కనకయ్య, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్లు రాజిరెడ్డి, సక్రియ, కృష్ణమాచారి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి ప్రసంగించగా, ప్రొఫెసర్లు కృష్ణారెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

అధికారుల ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

విధుల్లో అంకితభావమే పదవికి వన్నె తెస్తుంది

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మార్చి 28 : ప్రభుత్వ ఉద్యోగుల విధుల్లో వారి కున్న అంకిత భావమే ఆ పదవికి వన్నె తెస్తుందని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బైరి శ్రీనివాస్ దంపతులకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముగ్గురు అధికారుల దంపతులను శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు ఉత్తమ సేవలందించి వారి మన్ననలు పొందడం, సహోద్యోగులకు మార్గదర్శకులుగా గుర్తింపు పొందడం జీవితంలో మధురానుభూతిని కలిగిస్తాయన్నారు. విరమణ అనేది ఉద్యోగానికే కానీ మనసుకు కాదని పేర్కొన్నారు. సమాజ సేవలో ముగ్గురు అధికారులు తరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్ సింగ్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువులో ఉన్నతంగా రాణించాలి

అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే సందీప

జనగామ చౌరస్తా, మార్చి 28 : పిల్లలు చదువులో ఉన్నతంగా రాణించాలని జనగామ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే సందీప అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాల సదనంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి హాజరై మాట్లాడుతూ పిల్లలకు తమ హక్కుల గురించి అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం బాల సదనంలోని చిన్నారుల వసతి గృహం, కిచెన్, బాత్‌రూంలను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో బాలసదనం ప్రిన్సిపాల్ కే వెరోనిక, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవింద్ర, జ్యోత్స్న, శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

రవి(ఫైల్)

ఖిలావరంగల్, మార్చి 28: ఆర్థిక ఇబ్బందులు తాళలేక జూనియర్ అసిస్టెంట్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చింతలపల్లి-వరంగల్ రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలకేంద్రానికి చెందిన రావుల రవి(57) జనగామ కలెక్టరేట్‌లోని పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతడికి భార్య పుష్పలీల, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ముగ్గురు కూతుళ్ల వివాహాలు జరిపించిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురైన అతడు ధర్మారం గ్రామ సమీపంలో రైలు పట్టాలపై పడుకొన్నాడు. ఈ క్రమంలో రైలు అతడి పైనుంచి వెళ్లడంతో తల, మొండం వేర్వేరుగా పడిపోయాయి. మృతుడి వద్ద లభించిన మొబైల్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

ఆత్మీయ సమ్మేళనానికి అనుమతివ్వాలి

ఏసీపీకి తెలంగాణ ఉద్యమకారుల వినతి

హనుమకొండ, మార్చి 28 : తెలంగాణ ఉద్యమకారులు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డిని గురువారం కలిశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారులతో ఏప్రిల్ 8వ తేదీన బాలసముద్రంలోని జయశంకర్ స్మృతివనం (ఏకశిలా పార్కు)లో ఆత్మీయ సమ్మేళనం, ఏప్రిల్ 2న కేయూలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక - తెలంగాణ ఉద్యమకారుల ఆవశ్యకత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించుకునేందుకు అనుమతివ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఏసీపీని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, బోడ డిన్న, ఉద్యమకారులు వీరేందర్, బండి రజిని ఉన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో పరిశోధన చేస్తున్న విదేశీ శాస్త్రవేత్తల బృందం

వరిలో నీటి వినియోగం ఎక్కువైతే మిథేన్ గ్యాస్ విడుదల

విదేశీ శాస్త్రవేత్తల పరిశోధన బృందం వెల్లడి

ఖానాపురం, మార్చి 28: వరి పంటకు అవసరం కన్నా అధిక నీటిని వినియోగిస్తే మిథేన్ గ్యాస్ విడుదలై వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, రైతులు అవసరం మేరకే నీటిని వినియోగించాలని స్పెయిన్, ఫ్రాన్స్, అమెరికా శాస్త్రవేత్తలు చిన్‌మై, నెట్, కియాగో అన్నారు. మండలకేంద్రం శివారులో రైతు ఎడ్ల వాసుదేవరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వరిలో నీటి నిల్వ శాతంపై పరిశోధన చేశారు. వరి నీటి మొక్క కాదన్నారు. అధిక నీరు వినియోగిస్తే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. ఆరుతడి విధానం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఫౌండేషన్ రాష్ట్ర బాధ్యుడు పృథ్వీరాం, ఏరియా మేనేజర్ రాజు, రవితేజ, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

టీఏఏ డైరీ ఆవిష్కరణ

తొర్రూరు, మార్చి 28 : టీఏఏ 2024 డైరీని న